దొంగతనాల నివారణకు పటిష్ట నిఘా

● ఎస్పీ శరత్ చంద్రపవార్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జనవరి8 : జిల్లాలో దొంగతనాల నివాణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, పగలు, రాత్రి గస్తీ చేపట్టాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశించారు. బుధవారం జిల్లా నేర సమీక్ష సమావేశం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాత నేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. ప్రతి కాలనీలో, ముఖ్యమైన కూడళ్ల వద్ద, రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాల్లో, కాలనీల్లో, షాపుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవడం వల్ల ఏదైనా ఘటన జరిగిన వెంటనే నిందితులను గుర్తించేందుకు వీలు కలుగుతుందన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే బాలూనాయక్

శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జనవరి 8 : దేవరకొండ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ఆదేశించారు. పట్టణ శివారులోని మైనార్టీ శ్మశానవాటిక పనులను బుధవారం ఆయన పరిశీలించారు. శ్మశానవాటికలో చేపడుతున్న పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ తాహత్‌అలీ, నాయకులు ముక్కమల వెంకటయ్యగౌడ్, యూనుస్, శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి

● ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

త్రిపురారం : లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

త్రిపురారం/నిడమనూరు, జనవరి 8: పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉండేందకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నదని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. త్రిపురారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అందించారు. నిడమనూరు మం డల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో మండల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డల తల్లిదండ్రులు ఆమె వివాహానికి నేరుగా తాసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ గాజుల ప్రమీల, ఎంపీడీఓ విజయకుమారి, మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భారతీ భాస్కర్‌నాయక్, ముడిమల్ల బుచ్చిరెడ్డి, నిడమనూరులో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, మాజీ జడ్పీటీసీ రామేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

అసంక్రామిక వ్యాధులపై అవగాహన కల్పించాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి

నకిరేకల్, జనవరి 8 : అసంక్రామిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు వంటి వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి యోగస్వి, సీహెచ్ఓ వర సునంద, హెచ్ఈఓ నర్సింహాచారి, ఉపకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ, జనవరి 8: లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడంతో పాటు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు చేస్తున్న ఆందోళనల్లో భాగంగా మూడో రోజు రిలే నిరాహార దీక్షలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 3500 ఇండ్లు నిర్మించిందని, నల్లగొండ పట్టణంలోనూ 552 ఇండ్లు నిర్మించి లాటరీ ద్వారా లబ్ధిదారులను కూడా ఎంపిక చేసిందని తెలిపారు. వెంటనే వారికి ఇండ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు డీవైఎఫ్ఐ నేతలు మల్లం మహేశ్, పాలాది కార్తీక్, గుండాల నరేశ్, మహేశ్ మద్దతు పలికారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, అద్దంకి నర్సింహ, పాక లింగయ్య, మధుసూదన్‌రెడ్డి, కోట్ల అశోక్‌రెడ్డి, అవుట రవీందర్ పాల్గొన్నారు.

టీజీయూఎస్ మండలాధ్యక్షుడిగా శంకర్‌నాయక్

పెద్దవూర, జనవరి 8: తెలంగాణ గిరిజన సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ర కృష్ణకాంత్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ధీరావత్ శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ వాల్యానాయక్, ఉపాధ్యక్షుడిగా ధనావత్ సుశీల, కోశాధికారిగా ధీరావత్ హనుమానాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానావత్ సైదులునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతినాయక్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ ఊరే పద్మ భర్త :లక్ష్మయ్య, వయస్సు : 53 సం॥, వృత్తి : గృహిణి, నివాసం : ఇంటినెం. 5-12-592/3, BTS నల్లగొండ టౌన్ & జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నేను కొనుగోలు చేసినటువంటి ఇంటి యొక్క విక్రయ దస్తావేజు నం. 22499/2021, SRO- Nalgonda ద్వారా కొనుగోలు చేసినాను. దాని యొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నం. 2593/2014, Dated : 10-03-2014 & 795/2003, Dated : 14-02-2003, SRO- Nalgonda, శ్రీనివాసకాలనీ నుండి క్లాక్ టవర్ వెలుచుండగా మార్గ మధ్యలో పోయినవి. కావున ఇట్టి విషయము పై గతంలో నల్గొండ -II టౌన్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు యిచ్చినాము. సదరు ఆస్తి యొక్క వివరములు ఇంటి నం. 5-12-592/3, సర్వే నెం. 508, విస్తీర్ణము : 145.00 చ॥గ॥ 121.65 చ॥ మీ॥ ఫారెస్ట్ ఆఫీస్ ఏరియా,నల్లగొండ టౌన్ & జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు : ఉత్తరము : 18" వైడ్ రోడ్డు, దక్షిణము : గునగంటి సాయిలు ప్లాట్, తూర్పు : A. అనురాధ ప్లాట్, పడమర : పంపట్టి యాదగిరి ప్లాట్ ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికనచో నాక్లయింట్‌కు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయమంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరమునవో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి.నెం. 6-2-439/1, శ్రీనగర్ కాలనీ
నల్గొండ నల్లగొండ – 508001, తెలంగాణ
తేది : 07.01.2025 సెల్ :9440422393

ఎస్‌హెచ్‌జీల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్లు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జనవరి 8: నల్లగొండ జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు 270 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్లపై డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క, మంత్రి సీతక్క, సంబంధిత శాఖ అధికారులతో కలిసి బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్‌హెచ్‌జీల సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 11 సైట్లల్లో 270 ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. ఈ భూముల్లో రెవెన్యూ, ఫారెస్ట్, ఇతర శాఖల అధికారులతో తనిఖీలు పూర్తి చేసి సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు అవకాశాలపై నివేదిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతిలోపు ఆయా భూముల్లో ఉమ్మడి తనిఖీ, మ్యాచింగ్, బ్యాచింగ్‌ను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా ఫారెస్ట్ అధికారి రాజశేఖర్, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఎం పాండురంగా రావు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

కేతేపల్లి : ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న బండపాలెం గ్రామ రైతులతో ఆమె మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైవ్ మోడ్‌లో ధరణి దరఖాస్తుల సమస్య లేకుండా చూడాలని తాసీల్దార్ మధుసూదన్ రెడ్డికి సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల సర్వే డేటా ఎంట్రీపై ఎంపీడీఓ శ్రీనివాస్‌రావుకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు సకాలంలో చేపట్టాలని సూచించారు.

నేడు మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య జయంతి

హాలియా, జనవరి 8 : నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే దివంగత నోముల నర్సింహయ్య 69వ జయంతిని గురువారం నిడమనూరు మండలం వేంపాడు స్టేజీ వద్ద నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నోముల నర్సింహయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నోముల నర్సింహయ్య మరణించి మూడేండ్లు అయినప్పటికీ నేటికీ ఆయనను సాగర్ నియోజకవర్గ ప్రజలు నిత్యం స్మరిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, జనవరి 8 : నల్లగొండ పట్టణ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజారు, మాన్యంచెల్క, దారుషఫాకాలనీ, బస్టాండ్, డాక్టర్స్‌కాలనీ, బీటీఎస్, శంషన గర్, భారత్‌గ్యాస్ గోడౌన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆశవర్కర్ల వినతి

నీలగిరి, జనవరి8 : ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆశ కార్యకర్తలకు ఇవ్వాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ గోవింద్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. లెప్రసీ, పల్స్ పోలీయో, వివిధ రకాల పరీక్షలు నిర్వహించిన సందర్భంగా తమకు ఇస్తామన్న డబ్బులు చెల్లించడం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీఐటీయూ నాయకులు దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, అద్దంకి నర్సింహ, ఎడవల్లి ప్రేమలత, వీరభద్రమ్మ, సౌజన్య ఉన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

త్రిపురారం, జనవరి 8: మండలంలోని బెజ్జికల్ గ్రామానికి చెందిన ఇంజం ధనలక్ష్మికి చెందిన ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ధనలక్ష్మి మంగళవారం సాయంత్రం తన ట్రాక్టర్‌లో నారు తీసుకొచ్చి పొలం వద్ద ఉంచి ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ట్రాక్టర్ ట్రాలీ కనిపించకుండా పోయింది. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను వదిలేసి ట్రాలీని ఎత్తుకెళ్లారని, దాని విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

నీటి మడుగులో పడి మహిళ మృతి

మిర్యాలగూడ రూరల్, జనవరి 8 : నీటి మడుగులో పడి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని చిల్లాపురం వద్ద చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ–2 సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన వెలిజాల యాదమ్మ(54) మండలంలోని చిల్లాపురం రోడ్డు వద్ద ఉన్న వరి పొలంలో నాట్లు వేసేందుకు కూలీగా వెళ్లింది. పొలంలో నాట్లు వేసే సమయంలో దాహం వేయడంతో నీళ్లు తాగేందుకు సమీపంలోని బోరు వద్దకు వెళ్తుండగా కళ్లు తిరిగి బురద మడిలో బోర్లా పడిపోయి ఊపిరాడక మృతిచెందింది. మంచినీళ్ల వెళ్లిన యాదమ్మ ఎంత సేపటికీ రాకపోవడంతో తోటి కూలీలు వెళ్లి చూడగా పొలంలో ఆమె పడిపోయి కనిపించింది. తోటి కూలీలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని వెలికి తీసి పోస్టు మార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మృతురాలి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మునుగోడులో వైద్య శిబిరం

మునుగోడు, జనవరి8 : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని నల్లగొండ లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ చిలుకూరి రామకృష్ణ ప్రారంభించారు. సుమారుగా 200 మందికి వివిధ రకాల పరీక్షలునిర్వహించారు. ఐకాన్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ లయన్ గోపగోనియాదగిరి, క్లబ్ అధ్యక్షుడు నీలంరెడ్డి రొక్కం, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

శకుంతల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

నకిరేకల్, జనవరి 8 : నకిరేకల్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గుర్రం అంతయ్య సతీమణి గుర్రం శకుంతల ఇటీవల మృతి చెందారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుధవారం వారి ఇంటికి వెళ్లి శకుంతల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకట్, నాయకులు పెండెం సదానందం, నడికుడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యార్థులకు బెల్టులు, టై అందిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు అందచేత

పెద్దవూర, జనవరి 8: మండలంలోని వెల్మగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్‌రెడ్డి, మద్దూరి కృష్ణ బుధవారం టై, బెల్టులు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ తరి రాము మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం చేేందుకు దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మన్నెం వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బాషిపాక లక్ష్మీసురేందర్, ఉపాధ్యాయులు రహీం, నామిరెడ్డి ప్రశాంతి, ఉప్పునూతల వెంకయ్య, సత్యం, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు నారమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్ఐ మధు

గుర్రంపోడు, జనవరి 8: మండల కేంద్రంలో యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బుధవారం బాధితుడికి అందించారు. నల్లగొండకు చెందిన పురుశోత్తం మంగళవారం సాయంత్రం గుర్రంపోడు సెంటర్‌లో తన సెల్‌ఫోన్‌ను(రూ.1.10 లక్షల విలువైనది) ఓ దుకాణం వద్ద పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. విచారణ చేపట్టిన ఎస్ఐ పసుపులేటి మధు సీసీ కెమెరాల ఆధారంగా రెండు గంటల్లోనే సెల్‌ఫోన్ తీసుకెళ్లిన వ్యక్తిని గుర్తించి అతడి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. బుధవారం బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధు మాట్లాడుతూ మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్లే నిందితుడిని త్వరగా గుర్తించి పోయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేయగలిగినట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఆదిత్య విద్యార్థిని

విద్యార్థిని సహస్రారెడ్డిని అభినందిస్తున్న కరస్పాండెంట్ అమరేందర్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 8: పట్టణంలోని ఆదిత్య పాఠశాల పదవ తరగతి విద్యార్థిని గంటల సహస్రారెడ్డి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఆమె జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థిని బుధవారం పాఠశాలలో ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రిపురారం మండల ప్రత్యేకాధికారిగా లీల

కేజీబీవీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లీల

త్రిపురారం, జనవరి 8: మండల ప్రత్యేకాధికారిగా నల్లగొండలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ వీ.లీల బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఎంపీడీఓ విజయకుమారి, తాసీల్దార్ గాజుల ప్రమీల, ఎంఈఓ రవినాయక్, ఏఈ వెంకట్‌రెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మండల కేంద్రంలోని కేజీబీవీ, గిరిజన మినీ గురుకుల పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. మెనూ అమలు చేయాలని, పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు.ఆమె వెంట ఎంఈఓ, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి, మినీ గురుకులం ప్రిన్సిపాల్ వై.భారతి ఉన్నారు.

మాడ్గులపల్లి తాసీల్దార్‌గా సురేశ్



మాడ్గులపల్లి, జనవరి 8: మండల తాసీల్దార్‌గా ఎస్.సురేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తాసీల్దార్ పద్మ కలెక్టరేట్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో అడవిదేవులపల్లి తాసీల్దార్ సురేశ్ వచ్చారు. కార్యాలయ సిబ్బంది తాసీల్దార్ సురేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జి తాసీల్దార్‌గా శ్రీనివాస్

అడవిదేవులపల్లి : మండల ఇన్‌చార్జి తాసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి తాసీల్దార్ సురేశ్ మాడ్గులపల్లి మండలానికి బదిలీ కాగాఆయన స్థానంలో డీటీగా ఉన్న శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సాగు నీటి రంగంలో మెళకువలు తెలుసుకోవాలి

● ఐబీ సీఈ అజయ్‌కుమార్

మాట్లాడుతున్న ఐబీ సీఈ అజయ్‌కుమార్

నల్లగొండ, జనవరి 8: రైతులకు సేవ చేసే అవకాశం ఉన్న సాగునీటి శాఖలో ఉద్యోగం రావటం గొప్ప విషయమని.. సాగునీటి రంగంలో మెళకువలను తెలుసుకొని ముందుకు సాగాలని నీటిపారుదల శాఖ సీఈ అజయ్ కుమార్ అన్నారు. ఐబీలో జేఈఈగా ఉద్యోగం సాధించి కొత్తగా చేరిన 70 మందికి బుధవారం జిల్లా కేంద్రంలోని జీఎల్ గార్డెన్‌లో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టుల్లో అంకితభావంతో పని చేసి ప్రభుత్వ పెద్దలకు మంచి పేరు తేవడంతో పాటు ప్రాజెక్టును గొప్పగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఇంజినీర్ తనకు అప్పగించిన పనిని సక్రమంగా నిర్వహిస్తూ, అంకిత భావంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ రంగంలో ఉన్న సీనియర్ల సలహాలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఎన్ఎస్పీ ఎస్ఈ శ్రీధర్‌రావు, మాల్ ఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపోలు రవీందర్, ఇంజినీర్లు ఆంజనేయులు, క్రాంతికుమార్, యాదవ్ కుమార్, రేఖల ప్రభాకర్, చక్రపాణి, రాజారత్నం పాల్గొన్నారు.

నకిరేకల్ ఫొటోగ్రాఫర్‌కు జాతీయస్థాయి అవార్డు

మనోహర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జనవరి 8 : నకిరేకల్ పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ గునుగుంట్ల మనోహర్‌కు ఫొటోగ్రఫీలో జాతీయ స్థాయి అవార్డు దక్కింది. ఈ నెల 5,6 తేదీల్లో ఒడిశాలోని బోండాస్‌లో హుస్సేన్ ఖాన్ సెవెంత్ నేషనల్ వర్క్ షాప్ నిర్వహించారు. అంతరించిపోతున్న గిరిజన బోండా తెగ, వారి సాంప్రదాయ వేషాధారణ, నృత్యాలు, జీవనశైలిపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో అత్యుత్తమ ఫొటోలు తీసినందుకు గానూ మనోహర్‌కు అవార్డు అందించారు. బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మనోహర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు,

కేటీఆర్‌పై కక్ష సాధింపుతోనే కేసులు

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిడిగం నాగయ్య

మాట్లాడుతున్న పిడిగం నాగయ్య

తిరుమలగిరి(సాగర్), జనవరి 8: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, అందులో భాగంగానే ఈ–ఫార్ములా కారు రేసులో ఏదో జరిగిందని కేసు పెట్టిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిడిగం నాగయ్య అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేత గాక, ఆరు గ్యారంటీలు అమలు చేయలేక, ఈ విషయంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఏదో ఒక కేసును బనాయిస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌పై కేసు పెట్టడాన్ని బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్షసాధింపుకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధ చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు జటావత్ రమేశ్, నాయకులు బాణావత్ శివ, రమావత్ కిషన్, రమావత్ పవన్, ముని పాల్గొన్నారు.

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి : ఎస్ఐ

డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కట్టంగూర్, జనవరి 8 : రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు కంటి పరీక్షలు తప్పని సరి అని ఎస్ఐ రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కట్టంగూర్‌లోని దాబా వద్ద ఎంవీఐ, పోలీస్, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే పరీక్షలు చేయించుకొని అద్దాలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని అయిటిపాముల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై ఎస్ఐ రవీందర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటవస్తువుల పంపిణీ

విద్యార్థులకు ఆటవస్తువులు అందిస్తున్న ఎస్ఐ సైదులు

శాలిగౌరారం, జనవరి 8 : మండలంలోని మాదారం కలాన్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ లీడర్ మదన్‌మోహన్ సహకారంతో ఆట వస్తువులను అందించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ సైదులు వీటిని విద్యార్థులకు అందించారు. మండలంలోని అయిటిపాముల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై ఎస్ఐ రవీందర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పున్న శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు డెంకెల సత్యనారాయణ, గుండ్ల రామ్మూర్తి, దామెర్ల శ్రీనివాస్, పీఈటీ అయూబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి : ఎంఈఓ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

హాలియా, జనవరి 8 : ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కృషి చేయాలని అనుముల మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి సూచించారు. బుధవారం హాలియాలో తపస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు గుర్రం ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రేణుకుంట్ల రాజశేఖర్, గుర్రం సత్యనారాయణరెడ్డి, అక్కయ్యబాబు, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవి, శకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో ఇంటి పన్నులు వసూలు చేయాలి : డీపీఓ

నకిరేకల్, జనవరి 8 : గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని డీపీఓ కొండ వెంకయ్య ఆదేశించారు. బుధవారం నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయంలో నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, కోతులు, కుక్కల బెడద, ఇంటి పన్నుల వసూలు, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, నర్సరీల నిర్వహణ, శ్మశానవాటికల శుభ్రతపై రివ్యూ నిర్వహించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.